క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

భామిని: మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె. సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 మార్చి వరకు సుమారు రూ.18.90 కోట్లతో చేపట్టిన ఉపాధి పనులపై అధికారుల సమక్షంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

స్వరూపకు పీహెచ్‌డీ పట్టా


అధ్యాపకురాలు స్వరూప

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు జెట్టి స్వరూపకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. అండర్ స్టాండింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ బయ్యర్ డెసిషన్, ఎ కేస్ స్టడీ ఆఫ్ కోస్టల్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై విశేష కృషికి గాను స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ వారు ఈ గౌరవం ఇచ్చారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, అధ్యాపకులంతా స్వరూపను అభినందించారు.

స్త్రీ నిధి రుణాలు చెల్లించాలి


మహిళా సభ్యులతో మాట్లాడుతున్న ఏజీఎం హైమావతి, ఏపీఓ చక్రపాణి

భామిని: వెలుగు సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇచ్చిన స్త్రీ నిధి రుణాలను క్రమపద్ధతిలో చెల్లించాలని స్త్రీనిధి ఏజీఎం హైమావతి సూచించారు. వెలుగు ఏపీఎం మీసాల చక్రపాణితో కలిసి నేరడి-బి మహిళా సంఘ సభ్యులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో వడ్డీ భారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సీఓ ఎస్.రాజ్‌కుమార్, సీసీ కృష్ణకుమారి, వీఓఏ భవానీ, మహిళా సంఘాల సభ్యులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయాలపాలైన సురేంద్ర


తీవ్రంగా గాయపడిన కార్తీక్

వీరఘట్టం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సీఎస్పీ రహదారిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కార్తీక్(బబ్బులు) అనే యువకుడు మద్యం మత్తులో బైక్ డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా నడుచుకుని రోడ్డుపై వెళ్తున్న సురేంద్ర అనే యువకుడిని ఢీ కొట్టాడు. దీంతో కార్తీక్‌కు తలపైన, సురేంద్రకు ముక్కుపై గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించామన్నారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లయితే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అంటిపేటలో కల్వర్టు నిర్మాణం

సీతానగరం: మండలంలోని అంటిపేటలో మండల పరిషత్ నిధులతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. గ్రామం నుంచి కాలనీకి వెళ్లే రహదారి పరిధిలో కల్వర్టు నిర్మాణం కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీ వాసులు రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను గుర్తించిన స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఎస్.నిర్మల మండల పరిషత్ నిధులతో కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కల్వర్టు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే అంటిపేట నుంచి కాలనీకి వెళ్లేందుకు అవస్థలు తప్పుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

సీతంపేట ఏజెన్సీలో పూతదశలో జీడి పంట (ఇన్‌సెట్లో) తమ్మినేని అమరేశ్వరి



జీడి సాగులో.. జాగ్రత్తలు తప్పనిసరి

- ఏజెన్సీలో దాదాపు 70 వేల ఎకరాల్లో జీడి పంట సాగు
- గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం : ఉద్యానవన శాఖాధికారి అమరేశ్వరి

పాలకొండ రూరల్: ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ ప్రాంతంలో మామిడితో పాటు అధిక ప్రాధ్యానం కలిగిన వాణిజ్య పంటల్లో ఒకటైన జీడి ప్రస్తుత సీజన్‌లో పూత దశకు చేరుకుంది. ఈ తరుణంలో తోటల సాగులో నిమగ్నమైన రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే ప్రస్తుత శీతాకాలంలో కురిసే తేనె మంచు, పొగమంచు, ఇతర కీటకాల కారణంగా పూత మాడిపోయే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి చెబుతున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రైతులను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు.


పాలకొండ మండలంలో జీడి సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొమ్మ, పుష్పగుచ్ఛాలు తొలిచే పురుగు...

శీతాకాల సీజన్‌లో పూత దశలో కొమ్మ, పుష్పగుచ్ఛాలు తొలిచే పురుగు కారణంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా టీ దోమ, కాయ తొలుచు పురుగు, తామర పురుగులు, పిండినల్లి పురుగు వల్ల నష్టం ఏర్పడుతుంది. ఈ పురుగులు లేత కొమ్మల చివర్లను తొలచి సారంగం చేసి లోపల గుజ్జును, పుష్పగుచ్ఛాలను పాడుచేస్తాయి. దీనికారణంగా కొమ్మలు, పూత ఎండిపోతుంది. కాయ, గింజల మధ్య ప్రదేశంలో ఆశించే పురుగులు పండులోని గుజ్జును, గింజలోని పప్పును తిని నష్టపరుస్తాయి. దీనికి తోడు తామర పురుగులు ఎదుగుతున్న కాయలు, పండ్లను గీకుతూ రసం పీల్చడం వల్ల కాయలపై గరకు మచ్చలేర్పడి నాణ్యత తగ్గిపోతుంది. వీటిని నిర్మూలించేందుకు ఒక్కో మొక్కకు అర కిలో యూరియా, 250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 125 గ్రాముల వంతున అందించాలి. చెట్టు మొదలు వద్ద నాలుగు అడుగుల దూరంలో పల్లెం ఏర్పాటు చేసి ఈ ఎరువులు వేసి నీరు అందించాలి. ప్రస్తుత జనవరి నెలలో పువ్వు, పిందె దశలో టీ దోమ ఆశించే అవకాశం ఉంది. దీనిని అధిగమించేందుకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండో దశలో ఫిబ్రవరి మొదటి వారంలో క్లోరిపైరిపాస్ 2 మిల్లీలు లేదా లామ్డాసైహలోత్రిన్ 0.6 మిల్లీలు లీటర్ నీటిలో కలిపి మొక్కలకు పిచికారీ చేయాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా తామర పురుగు నష్టం కలుగజేస్తుంది. దీనిని అరికట్టేందుకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీలు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలు లేక మోనోక్రొటోఫాస్ 1.6 మిల్లీలు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అన్ని దశల్లో వ్యాప్తి చెందే పిండినల్లి పురుగును అరికట్టేందుకు 2.5 మిల్లీల డైక్లోరోవాస్ లేదా డైమిథోయేట్ 2 మిల్లీలు లేక ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బలవంతంగా పార్టీ ఫిరాయింపులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ, పార్టీ నాయకులు

సీతంపేట: కొంతమంది రాజకీయ దళారీలు తమ పబ్బం గడుపుకోవడానికి ఒత్తిడితోనే బలంతంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, అటువంటి వారి మాటలు నమ్మవద్దని ఎంపీపీ బి. ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హిమరిక మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. సీతంపేట ఏజెన్సీలోని పలువురు సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకువచ్చి జనసేనలో చేర్పించారని ఆరోపించారు. పనులు చేపట్టడమని.. చేసిన పనులకు బిల్లులు మంజూరు కావని భయపెడుతూ కొంతమంది పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారాలని ఆ పార్టీ నాయకులు ప్రలోభాలు చేసినా ఎవ్వరూ స్పందించలేదన్నారు. ఇప్పుడు కొందరు రాజకీయ దళారీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికార కూటమి నాయకుల వద్ద మెప్పు పొందడానికి గిరిజన సర్పంచ్‌లను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పార్టీలు మారి నీతి తప్పే సంస్కృతి మా గిరిజనులకు లేదన్నారు. ఏ పార్టీలో ఉన్నా గెలిచిన తర్వాత అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.తిరుపతిరావు, ఎస్.సిమ్మయ్య, రాజయ్య, కూర్మారావు, ప్రవీణ్, ఎస్.గణేష్, రవికుమార్, బాపయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎస్.చంద్రశేఖరరావు, ఎస్.మంగయ్య, గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి.చలపతిరావు, సోమేష్, వెంకి, ఎస్.షోడంగ, బి.అప్పారావు, మురళి, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ కళావతి

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టడం జరుగుతుందని సర్పంచ్ ఎం.కళావతి అన్నారు. మండలంలోని బాలేసు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బి.కృష్ణారావు ఆధ్వర్యంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక)పై గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అనంతరం పంచాయతీరాజ్‌లోని 29 అంశాలపై సమీక్షించి, పనులకు తీర్మానం చేశారు.



ఐటీడీఏ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వారితో పాటు పలు పనులపై వచ్చిన వారు ఈ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఆకుకూరలు, చిరుధాన్యాల ఉత్పత్తులు విక్రయించారు. ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ బిడ్డిక నరేష్, ఎస్‌డీఏ సత్యనారాయణ, కేశవరావు, భవానీ, తదితరులు పాల్గొన్నారు. - సీతంపేట

రక్తదానంపై అవగాహన తప్పనిసరి

యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. పాలకొండలో రక్తనిల్వల కేంద్రం అందుబాటులోకి రావడం ఆనందదాయకమన్నారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ నాగభూషణరావు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తదానం అన్నది అత్యంత అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి పి.చైతన్య, గండి రామినాయుడు, గంటా సంతోష్, జాడ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. - పాలకొండ





సీతంపేట మండలంలోని ఎగువదరబ గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ 16 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్నారు. పక్క గ్రామమైన రసూల్‌పేట నుంచి కూడా ఇక్కడకు విద్యార్థులు వస్తున్నారు. మట్టి గోడలతో ఉన్న షెడ్డులో పైన రేకులు వేసి పాఠశాల నిర్వహిస్తున్నారు. వర్షాలు వస్తే పాఠశాల నిర్వహణ కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి పక్కా భవనం మంజూరు చేయాలని సర్పంచ్ ఎస్.శిమ్మయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - సీతంపేట

రక్తహీనత నివారణపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్తహీనత నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి.శ్రీవరం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి పాల్గొని, రక్తహీనత బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తంలో తగినంతగా హిమోగ్లోబిన్ లేకపోవడాన్ని రక్తహీనతగా పేర్కొంటారన్నారు. హిమోగ్లోబిన్ 14 నుంచి 15 పాయింట్లు ఉంటే రక్తహీనత లేనట్లు అని, 12 పాయింట్ల కన్నా తక్కువగా ఉంటే రక్తహీనతతో బాధపడుతున్నట్లు అన్నారు. 10 పాయింట్ల కన్నా తక్కువగా ఉంటే రక్తహీనత ఎక్కువగా ఉన్నట్లు అని, 7 పాయింట్ల కన్నా తక్కువగా ఉంటే రక్తహీనత తీవ్రంగా ఉన్నట్లు అని తెలిపారు. రక్తహీనత బారి నుంచి తప్పించుకునేందుకు ఐరన్ పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఉమాజ్యోతి

బీజామృతంతో విత్తన శుద్ధి మేలు

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి, వేసుకోవడం ద్వారా పంటలకు చీడపీడలు, తెగుళ్లు సోకే అవకాశాలు తక్కువగా ఉంటాయని రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) దుడ్డుఖల్లు క్లస్టర్ ఎల్‌వన్ ఎం.సీతారాం తెలిపారు. మండలంలోని బెల్లిడి గ్రామంలో ఏటీఎం మోడల్(పద్ధతి)లో పంటల సాగు, బీజామృతంతో విత్తనాల శుద్ధిపై సోమవారం అవగాహన కల్పించారు. గ్రామంలో 365 రోజుల పాటు పంటల దిగుబడి వచ్చేలా ఏటీఎం మోడల్‌లో పంటల సాగుకు మహిళా రైతులు ఎస్.దొరమ్మ, ఎం.కమలమ్మ శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌టు ఎన్.గౌరీశంకర్, ఐసీఆర్‌పీ ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అధ్వానంగా ఏబీ రోడ్డు..


ఇటీవల కురిసిన వర్షాలకు సింగిడి - పసుకుడి మధ్య రోడ్డులో ఏర్పడిన గోతులు

మండలంలోని ఏబీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ రోడ్డు మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం వల్ల రోడ్డు త్వరగా పాడైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విశాఖపట్నం పోర్టు నుంచి ఛత్తీస్‌గఢ్‌కు భారీ వాహనాలు వస్తున్నాయి. ఇప్పటికే రోడ్డు అధ్వానంగా ఉండడం.. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - భామిని


ఏబీ రోడ్డు మీదుగా వెళ్తున్న భారీ వాహనాలు

ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలి

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్క ద్విచక్రవాహన దారు హెల్మెట్‌ను విధిగా ధరించాలని పార్వతీపురం పట్టణ సీఐ మురళీధర్ తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్‌కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌లు లేని కారణంగా రెండు రోజుల క్రితం పట్టణంలో యాక్సిడెంట్ అయి ఒకరు మృతిచెందారని తెలిపారు. పట్టణంలో పెరిగిన రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. హెల్మెట్ వాడకం, రహదారి భద్రత నియమాలను పాటించాలని, క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే వారిపై జరిమానా విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

సీతానగరం: సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి తోడ్పడాలని ఈఓపీఆర్‌డీ కుమార్ వర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తలను పారిశుద్ధ్య కార్మికుల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిపారు. సేకరించిన వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువుగా తయారు చేయనున్నట్లు చెప్పారు. తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీల నిధులను పెంచనున్నట్లు వివరించారు.

పీసా ఎన్నికల్లో 275 గ్రామాల్లో ఏకగ్రీవం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో జరిగిన పీసా ఎన్నికల్లో 278 గ్రామాలకు గాను 275 గ్రామల్లో ఏకగ్రీవం అయినట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది పీసా మండలాల్లో ఈ నెల 2 నుంచి 6 వరకు 278 పీసా గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఎన్నికలు జరగగా 275 గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతరు

- గ్రీవెన్స్ సెల్‌కు హాజరు కాని మండలాధికారులు

పాచిపెంట: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా కనిపిస్తోంది. ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ గతంలో ఆదేశాలు జారీ చేశారు. కాగా ఆ పరిస్థితి పాచిపెంట మండలంలో కనిపించడం లేదు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ పాత్రో మినహా తహసీల్దార్ గానీ, మిగిలిన ముఖ్యశాఖల అధికారులెవరూ అధికారులు హాజరుకాలేదు.

సమయపాలన పాటించాలి

గరుగుబిల్లి: ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు సూచించారు. మండలంలోని దళాయివలస గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. ప్రార్థనా సమయానికే పాఠశాలకు చేరుకున్న ఆయన.. ఆ సమయానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు కూడా నేర్పాలన్నారు. నాణ్యమైన విద్య, భోజనం అందివ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతిపై దృష్టిసారించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకుభోజనాలు వండిపెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థనా సమయానికే దళాయివలస పాఠశాలను సందర్శించిన ఎంఈవో అప్పలనాయుడు

జగనన్న హయాంలోనే అభివృద్ధికి బాటలు

- ఎమ్మెల్సీ పాలవలన విక్రాంత్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: వైద్యానికి అధిక ప్రాధాన్యం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే పాలకొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి బాటలు వేయటం జరిగిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రక్తనిల్వల కేంద్రం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. తాజాగా ఆ కేంద్రాన్ని ప్రారంభించడంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందని చెప్పారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో పూర్తి వసతులతో కూడిన ప్రత్యేక రక్త నిల్వల కేంద్రం కోసం తాను, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కృషి చేసినట్లు చెప్పారు. నాటి వైద్యారోగ్య శాఖా మంత్రి విడదల రజని దృష్టికి ఈ వియషం తీసుకెళ్లడంతో పాటు 2023 మార్చి17న శాసనమండలిలో ప్రస్తావించినట్లు తెలిపారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికెట్ సాధనలో భాగంగా ప్రత్యేక బ్లడ్‌బ్యాంక్ ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో కీలకమైన బ్లడ్‌సెల్స్ సెపరేషన్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈయన వెంట ఆ పార్టీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, తదితరులున్నారు.